**"ఆ్రదేంటే అమ్మడూ... ఒక్కదానివేంటి? ఏం-అల్లుడుగారు రాలేదా?" అంటూ కూతురికెదురెళ్లి ఆప్యాయంగా ఆమెను అక్కున జేర్చుకొంది ఆండాళ్ళమ్మ.**

"అమ్మా!" అంటూ తల్లిని వాటేసుకొని బావురుమంది కోమలి.

"ఏందే? ఏమైంది? అల్లుడుగారూ, నువ్వూ ఏదైనా గొడవగాని పడ్డారా?" కంగారు పడిపోయింది ఆండాళ్ళమ్మ.

సర్రున ముక్కుచీది, చెమ్మగిల్లిన చేతిని తల్లి చెంపకురాసి, "నేను ఊబిలో కూరుకుపోయానమ్మా! నా జీవితం సర్వనాశనమయిపోయిందమ్మా!" అంటూ జుత్తు పీక్కోసాగింది కోమలి.

వంటింట్లో బెండకాయలు తరుగుతున్న అవతారం కూతురి గొంతు విని హాల్లోకొచ్చాడు. "ఏంటమ్మడూ.... ఎందుకలా జుత్తు పీక్కుంటున్నావ్?" అన్నాడు కుడిచేతి చూపుడు వేల్తో ముక్కుమీద గోక్కుంటూ.

"వంటపని మధ్యలో ఆపేసి మీరెందుకొచ్చారిక్కడికి?" అంటూ ఆతగాడికేసి గుడ్లురిమిచూసి, "ఏంటే తల్లీ? ఏమైందే తల్లీ? సంగతేంటో సరిగ్గా చెప్పు... అల్లుడు గారు తాగొచ్చి నిన్ను హింసిస్తున్నారా? ముండల్తో తిరుగుతున్నారా?' అన్నది ఆండాళ్ళమ్మ కూతురి భుజాలు పట్టుకు కుదుపుతూ.

"ఠాప్!"

కూతురు ఆండాళ్ళమ్మ చెంప పగల గొట్టింది గావల్సనుకుని చంకలు గుద్దుకున్నాడు అవతారం. కానీ నిజానికి జరిగిందది కాదు. ఆండాళ్ళమ్మ కుదిపిన కుదుపుకి కోమలి చేతిలోని సూట్ కేసూడి క్రింద పడినందువల్ల అలా ఠాప్ మని శబ్దం వచ్చిందంతే!

"అబ్బే అలాంటిదేం లేదమ్మా. ఆయన సకల సద్గుణ సంపన్నుడు. అలాంటి దురలవాట్లేం లేవ్...."

మరైతే ఇంకేందే? నిన్ను ప్రేమగా చూసుకోవడం లేదా?"

"ఎందుకు చూసుకోరమ్మా- ఎంతో ప్రేమగా చూసుకుంటారు. నేనంటే ఆయనకు ప్రాణం....'

"మరైతే అన్నీ బాగానే వున్నాయ్ కదే....నీ జీవితం సర్వనాశనమై పోయిందంటున్నావేంటే?" ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టింది ఆండాళ్ళమ్మ.

ఏ కందిరీగో వచ్చి ఆ నోట్లో దూరి నాలుక మీద కుడితే బావుండ్ననుకున్నాడు అవతారం. ఆ ఆలోచన ఆతగాడికి కితకితలు పెట్టేసింది. "ఇహిహి....ఇహిహి ఇహిహి...." అన్నాడు మెలికలు తిరిగిపోతూ.

"ఏయ్.... ఏంటా ఇకిలింపు? అయినా మిమ్మల్ని వంటింట్లో తగలడమన్నానుగా.... ఇంకా ఇక్కడే చచ్చారేం?" అంటూ గర్జించింది ఆండాళ్ళమ్మ.

"తగలడతాన్లే ఆండాళ్ళూ... అమ్మాయేదో చెబుతోందికదా.... నన్ను కూడా విన్నీ మరి..., ప్లీజ్" అంటూ చేతులు పిసుక్కున్నాడు అవతారం.

"ఆయితే బుద్ధిగా నిలబడి వినండి. అంతేగాని మళ్ళీ ఇకిలించారంటే పళ్ళు పీకేస్తాను" అంటూ చూపుడువేలూపి "ఊ.... చెప్పమ్మడూ! ఏంటి- ఏంటి నీకొచ్చిన కష్టం?" అన్నది ఆండాళ్ళమ్మ కూతురి తల నిమురుతూ.

"ఏం చెప్పనే అమ్మా! ఆయనగార్కి.... ఆయనగార్కి" మాట పూర్తి చెయ్యలేక పమిట చెంగు నోట్లో కుక్కుకొంది కోమలి.

"పమిటచెంగుని తీరుబాటుగా తర్వాత నవలొచ్చులేగాని సంగతేదో త్వరగా చెప్పవే తల్లీ! అసలే నాకు రక్తపోటు. నన్నిలా కంగారు పెట్టేయడం మంచిది కాదు. ఊఁ.... చెప్పు...."

"కొంపతీసి మగతనంగాని లేదా ఏంటి?" మధ్యలో కల్పించుకున్నాడు అవతారం. గుడ్లురిమి చూసింది ఆండాళ్ళమ్మ.

"హుఁ" బయల్దేరాడండి పెద్ద మగమహారాజు'.... బుద్ధిగా వుంటమని చెప్పానా? మళ్ళీ గనక నోరుతెరిస్తే మర్యాదగా వుండదు. ఊఁ....ఆయన సొల్లు వాగుడుకేం వచ్చెలే గాని, నువ్ చెప్పవే అమ్మడూ!"

"ఆయన గార్కి....ఆయన గార్కి...."

"ఊఁ....అయన గార్కి...."

"వంట చెయ్యడం రాదే అమ్మా! రోజూ నాతోనే వండించుకు తింటున్నారు...."

"ఎట్టెట్టా? పెళ్ళై ఆర్నెల్లవుతున్నా ఇంకా వంట నేర్చుకోకుండా నీతో వండించుకు తింటున్నాడా? అమ్మ గాడిదకొడుకు! నువ్వెలా ఊరుకుంటున్నావే మరి?" అంటూ దవడలొత్తుకుని- ఆ మీదట అశ్రువులు రాల్చింది ఆండాళ్ళమ్మ.



# చిట్కా యం.బి.కషన్

"నేర్చుకోమని నేను నెత్తీ, నోరు మొత్తుకుని చెప్పినా వినటం లేదే అమ్మా."

"పోనీ దాన్ని ప్రయోగించక పోయావా?"

"దేన్ని?"

"ఏంటే ఆ పిచ్చి ప్రశ్న? నిన్ను కాపురానికి పంపించేటప్పుడు నీ కన్నీ చెప్పే పంపానుగా?"

"ఓ అదా.... అప్పుడా లక్రా? ఇహిహి.... లేదమ్మా! ఇంకా ప్రయోగించలేదు. కొత్త గదా, ఇప్పట్నుంచే మొదలెడ్తే ఏం బావుంటుంది చెప్పు?"

"అవునవును బావుండదు. నేనుకూడా మీ నాన్నగారిమీద పెళ్ళయిన రెండేళ్ళవరకూ దాన్ని ప్రయోగించలేదు...."

"అబద్ధం!" అరిచాడు అవతారం. "ఎందుకాండాళ్ళూ అలా అబద్ధాలాడ్తావ్? మన పెళ్ళయిన ఎనిమిదోనెల్లో ఒకరోజు నేను కూరలో కారం ఎక్కువేశానని నువ్ నామీద దాన్ని ప్రయోగించ లేదూ?" అన్నాడు ముక్కులు చిట్లించి.

"ఏమో ఎవడిగ్గుర్తు? అది సరేగాని మిమ్మల్ని నోర్మెత్తద్దన్నానుగా.... మళ్ళీ ఎందుకు వాగుతున్నారు?" అంటూ హూంకరించింది ఆండాళ్ళమ్మ.

"తప్పయిపోయిందాండాళ్ళూ" అంటూ లెంపలేసుకున్నాడు అవతారం.

"ఒక పని చెయ్యాల్సించే అమ్మడూ! వండిన ప్రతి కూరలోనూ కారమో, ఉప్పో ఏదోటి ఎక్కువేస్తూ ఉండాల్సింది.... అది తినలేకయినా ఈపాటికి వంట నేర్చేసుకునుండేవాడు."

"అలా చాలాసార్లు ప్రయత్నించానే అమ్మా! కానీ లాభం లేకపోయింది. ఆ మహానుభావుడి నాలుక నాలుక్కాదో ఏమో మరి....ఎలా వొండినా అద్భుతం కోమలీ అంటూ లొట్టలేస్తూ మరీ తినేస్తారు...."

"ఓహో....ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో కదూ....మింగుడుకి బాగా అలవాటు పడిపోయి ఏది పెట్టినా మింగేస్తున్నాడన్నమాట! అవీసరే, పోనీ నెల్లో ఆ మూడ్రోజులైనా వొండుతున్నారా లేదా?"




బయలు చెప్పడానికి ఒకింత తటపటాయించి చెప్పింది కోమలి; "లేదే అమ్మా! ఆయన కలాంటి పట్టింపు లేవీ లేవు....'నేను బయటున్నానండి' అంటే, "ఛీ! అదంతా ఒక చాదస్తం! అలాంటివేం పెట్టుకోకు....మామూలుగా వుండు" అంటూ కొట్టిపారేస్తారు. ఆ మూడ్రోజులు కూడా నేనేచేస్తున్నాను వంట...."

"హవ్వ-ఇదెక్కడి చోద్యమే తల్లీ? అతగాడికి బుద్ధి లేకపోతే పోనీ నీ కన్నా ఉండక్కర్లా?"

"ఏం చెయ్యనే అమ్మా? ఆయన జగమొండి. ప్రతిదాన్కీ ఆయన మాటే చెల్లాలంటారు...." అంటూ కొంగుతో కళ్ళొత్తుకొంది కోమలి.

"అలాగా....అయితే ఇహ లాభంలేదమ్మడూ ఇంక తాత్సారం చెయ్‌బాకు....దాన్ని ప్రయోగించటం మొదలెట్టేసెయ్...."

"చెప్పేనుగా అమ్మా....ఇప్పట్నించే దాన్ని ప్రయోగించటం నాకు సుతారామూ ఇష్టం లేదు.."

"మరైతే ఎలాగో ఈ సమస్యని పరిష్కరించటం?"

"నన్నడిగితే నేనేం చెప్పనే. అమ్మా.......నువ్వేదైనా సలహా ఇస్తావనే కదా- నీ దగ్గరికి పరిగెత్తుకొచ్చింది...."

"సర్లే సర్లే........నిదానంగా ఆలోచిద్దాంలే గాని....గుమ్మం దగ్గరేనిలబడి పోయావ్.. ముందింట్లోకి నడువ్....స్నానం గట్రా కానిచ్చి కాసేపు రెస్ట్ తీసుకో.."

కోమలక్కడ్నించి కదిలింది.

"అన్నట్టు రెస్టంటే గుర్తొచ్చిందాండాళ్ళూ. ఈరోజు నాకేంటో ఒంట్లో నలతగా ఉంది. ఈ పూటకి వంట నువ్ చెయ్యరాదూ.. నేనుకూడా రెస్ట్‌తీసుకుంటాను.." అంటూ జాలిగొలిపేలా ముఖం పెట్టాడు అవతారం.



ఉరిమి చూసింది ఆండాళ్ళమ్మ "మీ నక్క జిత్తులు నా దగ్గర కాదు....ఏం - ఏం మాయదారి రోగవొచ్చింది? వంట చేయడానికి నేనేం తీరుబాటుగాలేను. నవలొకటి మధ్యలో ఆగిపోయింది- వెళ్ళి రాసుకోవాలి." అంటూ విసవిసా తన గదిలోకివెళ్ళిపోయింది.

అవతారం మళ్ళీ వంటింట్లో దూరబడి బెండకాయలు తరగటం పునఃప్రారంభించాడు.

* * *

ఆ మధ్యాహ్నం.... భోజనాలైన తర్వాత....

ఆండాళ్ళమ్మ తన గదిలో కూర్చొని నవల రాసుకుంటూండగా, అవతారం కూతుర్ని చెంతకు పిలిచి కబుర్లు మొదలు పెట్టాడు.

"ఏంటే అమ్మడూ, పొద్దున్న నువ్వమ్మతో చెబుతుంటేవిన్నాన్లే గాని.... ఆ రాకాసి పక్కనుంది గదా, సరిగ్గా తల కెక్కలేదు. ఇప్పుడుచెప్పు నీ బాధేంటో" అనడిగాడు ఎంగిలి కంచాలు కడుగుతూ.

"ముందు పనికానియ్ నాన్నా నువ్ పని మానేసి నాతో కబుర్లాడుతూ కూర్చుంటే అమ్మొచ్చి గొడవ చేసుద్దేమో!" అన్నది కోమలి.

"అబ్బే పనెందుకు మానేస్తానమ్మా.... పనిదారిపనిదే, కబుర్ల దారి కబుర్లదే! ఊఁ.... చెప్పు" అన్నాడు అవతారం.

వంటరాని భర్తతో తనెన్ని అగచాట్లు పడుతున్నదో-పొద్దున చెప్పిన దానికన్నా వివరంగా-పూసగుచ్చినట్టు చెప్పుకొచ్చింది కోమలి...మధ్యమధ్యలో కన్నీరు కారుస్తూ.

కూతురి కన్నీరు చూసి అవతారంలోని పితృ హృదయం తల్లడిల్లి పోయింది.

"ఊరుకోమ్మా.... ఊరుకో" అంటూ కన్నీరు తుడిచి ఆమె

వీపు మీద ఆప్యాయంగా నిమిరాడు.

ఆ ఆప్యాయతకు కోమలి కళ్ళు మళ్ళీ చెమ్మగిల్లాయి.

"మీ అమ్మ కూడా మొదట్లో కొన్నాళ్ళు నాతో నీలాగే అవస్థ పడిందమ్మా మొదట్లో నాకూ వంటొచ్చేది కాదు."

కడిగిన గిన్నెల్నీ, కంచాల్నీ పొడిగుడ్డతో తుడిచి బీరువాలో సర్దుతున్న తండ్రి కేసి విస్ఫారిత నేత్రాలతో చూస్తూ- "నీకేం నాన్నా? నువ్ దేవుడులాంటి మనిషివి. అందుకే తొందరగా వంట నేర్చేసుకొని అమ్మని సుఖ పెట్టడం మొదలెట్టేవ్ కానీ ఆయన నీలాక్కాదే; ఒకంతట కొరుకుడు పడే రకం గాదు...." అని మోకాళ్ళలో శిరస్సు దూర్చింది కోమలి.

అవతారం చకచకా ఆమె దగ్గరి కొచ్చి, భుజం మీద లాలనగా రాస్తూ- "బాధ పడకమ్మా! ప్రతి సమస్యకీ ఓ పరిష్కారముంటుంది. నీ సమస్యని నేను గట్టెక్కిస్తానుగా....నాకో మాంఛి ఉపాయం తట్టింది" అన్నాడు.

"నిజమా నాన్నా?" కోమలి కళ్ళు ఆనందంతో మిలమిలా మెరిశాయ్.

"నిజం తల్లీ! ఈ దెబ్బతో అల్లుడుగారు దార్లోకి రావడం ఖాయం!"

"చెప్పు నాన్నా.... ఏంటది? త్వరగా చెప్పు...."

"మీ అమ్మ రాసే నవల్లు నువ్వెప్పుడైనా చదివేవా?'

చటుక్కున ముక్కు మూసుకొంది కోమలి.

"చూశావా చూశావా.... ఆ ఊసెత్తగానే అప్పుడే కంపు కొట్టడం మొదలైపోయింది.... వాటి ప్రభావమే అంత!"

"నాన్నా ప్లీజ్.... ఆ టాపిక్ ఛేంజ్ చెయ్....నాకు డోకొచ్చేలా ఉంది...."

"వచ్చినా ఫర్వాలేదులే గాని కాసేపోర్చుకో తల్లి.... అసలు కిటుకు అందులోనే ఉంది మరి.."

"కిటుకా?"

"అవున్తల్లీ కిటుకే!"

"మరైతే త్వరగా చెప్పు...."

"చెప్తాను తల్లీ చెప్తాను.... నీకొక్కదానికి కాకపోతే ఎవరికి చెప్తాను? మీ అమ్మ రాసిన ఏదో ఒక నవల పట్టుకుని రేపే నువ్ మీ ఇంటి కెళ్ళిపో.... ఇంటికెళ్ళాక ఆ నవల్ని చిన్నచిన్న ముక్కలుగా చింపి ఓ ప్లాస్టిక్ బకెట్‌లో నీళ్ళు పోసి వాటిని మూడ్రోజుల పాటు నానబెట్టు...."

"రేకు బకెట్ అయితే పనికి రాదా నాన్నా?"




"వొద్దు తల్లీ! కెమికల్ రియాక్షన్ లాంటిదేదైనా జరిగితే నిష్కారణంగా బకెట్ పాడైపోద్ది.... ఊc సరే.... ఆ ముక్కలు మూడ్రోజులు నానాయి కదా, ఆ తర్వాత.... అంటే నాలుగో నాడన్న మాట.... వాటిని తీసి రుబ్బు రోట్లో వేసి మెత్తగా రుబ్బు ఆ ముద్దలో కాసిన్ని నీళ్ళు పోసి గరిటె జారుగా అంటే బజ్జీల పిండి మాదిరిగా అన్న మాట-అలా కలిపి ఓ సీసాలోకెత్తి జాగ్రత్తగా ఉంచు...."

"ఇదేంటి నాన్నా చిట్కా చెప్తానని ఏదో వంట చెయ్యడం నేర్పిస్తున్నావ్?" ఆశ్చర్యంగా అడిగింది కోమలి.

"వంట కాదే పిచ్చి తల్లీ! వంట రుచిహారం."

"వంట రుచిహారమా? అంటే?!!"

"అంటే ఏముంది.... వంట సందలి రుచిని హరించునది అది అర్థం. పై జెప్పిన పదార్థాన్ని- అంటే సీసాలోకెత్తి ఉంచుకున్న దాన్నన్న మాట- అల్లుడు గారిక్కి భోజనం వడ్డించినపుడల్లా కూర్లోనో పులుసులోనో ఓ రెండు చుక్కలు వెయ్యి చాలు. ముద్ద కలిపి నోట్లో పెట్టుకోగానే కైలాసం కనబడుద్ది గురుడికి!"

"అంటే ఏకంగా చచ్చేపోతారా నాన్నా?" భయం భయంగా చూసింది కోమలి.

"డొవరమ్మా.... కంపు ఫ్గన్ వికారమే తప్ప ప్రాణాలను హరించేటంత శక్తిలేదు మీ అమ్మ నవలలకి. దీన్ని ఆషామాషీ సలహాగా భావించి కొట్టి పారెయ్యకు ఒక్కసారి అమలు చేసి చూడు.... ఫలితం కనిపించకపోతే నన్ను చెప్పుచ్చుకొట్టు...."

"అద్దిర బన్నా! అమ్మోయ్!!" గావుకేక పెట్టింది కోమలి.

"దాన్నెందుకమ్మా పిలుస్తున్నావ్?" కంగారు పడిపోయాడు అవతారం.

"నువ్విలాంటి అమోఘమైన సలహా చెప్పేవని అమ్మకి చెప్తే నిన్నెంత మెచ్చుకుంటాదో తెల్సా?"




"అయ్ బాబోయ్! అంత పని చెయ్యకు!! మెచ్చుకోవడం కాదు మక్కెలిరగ్గొట్టుద్ది. కాకి పిల్ల కాకికి ముద్దని, మీ అమ్మ నవలలు ఆవిడికి బాగానే ఉంటాయ్. వాటిని గురించి నేనిలాంటి అభిప్రాయంతో ఉన్నానని తెలిస్తే ఇంకేమన్నా ఉందా?" అంటూ గజగజా వొణికిపోయాడు అవతారం.

"ఏంటి తల్లీ పిల్చావ్?" రానే వచ్చింది ఆండాళ్ళమ్మ.

"నా సమస్యని నాన్న ఇట్టే పరిష్కరించేశారమ్మా!"

"ఏంటేంటీ? నిజంగానే?!! ఆ మొహానికన్ని తెలివితేటలెక్కడ్నించొచ్చాయబ్బా?!" అంటూ ఆశ్చర్యపోయి- "ఇంతకీ ఏంటే ఆ పరిష్కార మార్గం?" అనడిగింది ఆండాళ్ళమ్మ.

కూతురి కేసి దీనంగా చూశాడు అవతారం.

"అబ్బే.... అదిప్పుడప్పుడే చెప్పకూడదమ్మా! అమలు చేశాక ఫలితం కనిపిస్తే అపుడు చెప్తాలే."

"అబ్బ పోవే బోడి సస్పెన్సూ నువ్వూను. నా నవలలు చదివి నీక్కూడా సస్పెన్స్ మెయిన్‌టెయిన్ చెయ్యడం బాగా అబ్బేసినట్టుంది. సరే, ఫలితం కనిపించాకే చెబుదువులే' అంటూ ఇంకేం రొక్కించకుండా అక్కడి నుంచి వెళ్ళిపోయింది ఆండాళ్ళమ్మ- నవల మధ్యలో ఆపేసొచ్చినందువల్ల కంగారు కొద్దీ.

"కృతజ్ఞుడ్ని తల్లీ!" అంటూ చేతులు జోడించాడు అవతారం.

"తప్పు నాన్నా! కన్న కూతుర్ని నాకు నువ్వు కృతజ్ఞతలు చెప్పడం ఏంటి? ఆ మాట కొస్తే నేనే నీకు కృతజ్ఞతలు చెప్పాలి ఇంత మంచి సలహా ఇచ్చినందుకు" అన్నది కోమలి.

ఆ మర్నాడు కోమలి వాళ్ళ ఇంటికి వెళ్ళిపోయింది.

ఓ వారం తర్వాత-ఆమె దగ్గర్నుంచి ఆండాళ్ళమ్మకి ఉత్తరం వచ్చింది- "నాన్న దయ వల్ల (ఆ చిట్కా పుణ్యమా అని) మీ అల్లుడుగారు పూర్తిగా మారిపోయారే అమ్మా!" అంటూ.

ఆ ఉత్తరం చూసి,ఆ చిట్కా ఏంటో తనకి చెప్పమని భర్తని నిలదీసి అడిగింది ఆండాళ్ళమ్మ.

అవతారం స్పృహ తప్పి పడిపోయాడు. •

ఇక లేస్తాడో లేదో!

జ్యోతిషం

* భవిష్యత్తులో లభించే అభివృద్ధి అవకాశాలేమిటో తెలుసుకోవడానికి ఎస్ట్రోలాజికల్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్, 13 జర్నలిస్టు కాలనీ హైదరాబాద్-34 కు రాయండి. ఫోన్: 8857